# 42

# దేవుని గొప్ప ప్రణాళికలు

## (యెషయా 45)

ఇశ్రాయేలును విడుదల చేయుటకు కోరెషు దేవుని సాధనమై యుండునని 44:24-28లో చేయబడిన ప్రకటన 45:1-7లో విపులీకరింపబడి యున్నది. ఈ ఘోషణ ఇశ్రాయేలుకు దిగ్భ్రాంతి కలిగించియుండును. దేవుడు తన సంకల్పములను సాధించుట కొరకు అన్యుడైన రాజును ఒకనిని ఎలా వాడుకొంటాడు? మిగిలిన అధ్యాయమంతా (8-25 వచనాలు) ఇందుకు సమాధనమిచ్చుచున్నది. దేవునికి ఇశ్రాయేలుపైనను సకల జనాంగములపైనను సర్వోచ్ఛమైన అధికారము కలదని ప్రజలకు గుర్తుచేయబడినది. సర్వలోకమును సృజించిన సృష్టికర్తగాను ఇశ్రాయేలును ఏర్పరచుకొన్నవాడుగాను, ఆయన ప్రతిపాదించిన ప్రతి విషయము జరుగునట్లు ఆయన చేయగలడు. ఆయన వాక్కు శక్తివంతమైనది.

**దేవుని చేత అభిషేకింపబడినవాడైన కోరెషుకు, ఒక సందేశము (45:1-7)**

45వ అధ్యాయం యొక్క ప్రారంభము దేవుడు దేశములపైనను ఆయన అండదండలను ఆశ్రయముగా కలిగియుండి వారి మనుగడ సాగించుచుండిన ఇశ్రాయేలు పైనను వినియోగించిన అధికారము గూర్చి చెప్పుచున్నవి. ఆయనొక్కడే నిజమైన దేవుడని ఆయన విశిష్ఠత గూర్చి కూడా అది తెలియజెప్పుచున్నది.

అతని పక్షమున జనములను జయించుటకు నేను
 అతని కుడిచేతిని పట్టుకొనియున్నాను
నేను రాజుల నడికట్లను విప్పెదను; ద్వారములు అతని
 యెదుట వేయబడకుండ తలుపులు తీసెదను
అని యెహోవా తాను అభిషేకించిన కోరెషును గురించి సెలవిచ్చుచున్నాడు.
-నేను నీకు ముందుగా పోవుచు మెట్టుగానున్న
 స్థలములను సరాళముచేసెదను.
ఇత్తడి తలుపులను పగులగొట్టెదను ఇనుపగడియలను విడగొట్టెదను.
పేరుపెట్టి నిన్ను పిలిచిన ఇశ్రాయేలు దేవుడనైన
 యెహోవాను నేనే యని నీవు తెలిసికొనునట్లు
అంధకారస్థలములలో ఉంచబడిన నిధులను
రహస్యస్థలములలోని మరుగైన ధనమును నీ కిచ్చెదను.
నా సేవకుడైన యాకోబు నిమిత్తము
నేను ఏర్పరచుకొనిన ఇశ్రాయేలు నిమిత్తము నేను
 నీకు పేరుపెట్టి నిన్ను పిలిచితిని
నీవు నన్ను ఎరుగకుండినప్పటికిని నీకు బిరుదులిచ్చితిని
నేను యెహోవాను, మరి ఏ దేవుడును లేడు
నేను తప్ప ఏ దేవుడును లేడు.
తూర్పుదిక్కునుండి పడమటిదిక్కువరకు
నేను తప్ప ఏ దేవుడును లేడని జనులు తెలిసికొనునట్లు

నీవు నన్ను ఎరుగకుండినప్పటికిని నిన్ను సిద్ధపరచితిని
యెహోవాను నేనే నేను తప్ప మరి ఏ దేవుడును లేడు
నేను వెలుగును సృజించువాడను
అంధకారమును కలుగజేయువాడను
సమాధానకర్తను కీడును కలుగజేయువాడను నేనే
యెహోవా అను నేనే వీటినన్నిటిని కలుగజేయువాడను.

పారసీక రాజైన కోరెషు దేవుని "అభిషిక్తుడు" అని మొదటి వచనము సూచించుచున్నది. దేవుని మేరకు అభిషేకింపబడినవారిలో కోరెషు మరియు ఆరాము దేశస్థుడును రాజునైన హజాయేలు (1 రాజులు 19:15) మాత్రమే ఇశ్రాయేలీయులు కానివారని గుర్తింపబడినది. "అభిషిక్తుడు" అను అర్థమునిచ్చు హీబ్రూ పదము *mashiach, mashach* అను మూల పదము నుండి వచ్చినది. *Mashach* అను మూల పదము నాలుగింతల వేదాంత ప్రాముఖ్యత కలిగియున్నదని Victor Hamilton చెప్పుచున్నాడు: (1) దేవుని సేవ చేయుట కొరకు అధికారమియ్యబడిన ఒక వ్యక్తి లేక వస్తువును తెలుపుచున్నది, (2) అభిషిక్తుడైనవానికి ప్రత్యేక గౌరవము ఇవ్వవలెను, (3) దైవీకమైన సామర్థ్యము *mashah*తో, సహకరించునని ఒకరు అనుకొనవచ్చును, మరియు (4) దీనికి వచ్చుచున్నాడని వాగ్దానము చేయబడిన విమోచకునితో, యేసుతో, సంబంధము కలదని చెప్పబడినది.[1] దేవుని సేవ చేయుటకు అధికారమియ్యబడినదను భావముతో అభిషేకింపబడనవారిలో యాజకులు, రాజులు, ప్రవక్తలు మరియు అందరిని మించిన ఆధిక్యతగలవాడు: యేసు ఉండిరి. క్రొత్త నిబంధనలో *christos* అను పదము సమానార్థమునిచ్చునదై యున్నది. *Christos* అను పదము హెబ్రీ పదములోనుండి అనువదింపబడినదని అపొస్తలుడైన యోహాను స్పష్టం చేసాడు: "ఇతడు (ఆంద్రెయ) మొదట తన సహోదరుడైన సీమోనును చూచి, 'మేము మెస్సీయను కనుగొంటిమని' " అతనితో చెప్పెను. మెస్సీయ అను మాటకు "అభిషిక్తుడని అర్థము" (యోహాను 1:41, 42). యోహాను మొదట *Messian* అను హెబ్రీ పదమునకు లిప్యంతరీకరణము చేసి (ఒక భాషలోని పదాన్ని యథాతథోచ్చారణతో వేరొక భాషావర్ణాలతో రాయడము) అటుతరువాత దాని అనువాదము నిచ్చాడు: క్రీస్తు (*christos*).[2]

కోరెషు దేవుని చేత అభిషేకింపబడుట ఒక నిర్దిష్టమైన కార్యభారమును అనగా బబులోను చెరను అంతమొందించి దేశబహిష్కృతులైనవారు యెరూషలేమునకు తిరిగి వచ్చు కార్యమును నెరవేర్చుటకు దేవుడు అతనిని వాడుకొన్నాడని సూచించుచున్నది.[3] అతడు దేవుని నిజమైన భక్తుడను భావమును అది చూపించుటలేదు. ఆరాము దేశ రాజైన హజాయేలు విషయములో కూడా ఈ సత్యమే వర్తిస్తుంది.

"జయించుటకు," "విప్పుటకు," "తలుపులు తీసిన" మరియు "వేయబడకుండ" – ఈ పదములన్నీ రాజైన కోరెషు ప్రాచీన ప్రపంచంపై ఉరవడితో సాధించిన విజయాన్ని వర్ణించుచున్నవి. "నేను నీకు ముందుగా పోవుదునని" అని ప్రకటనలో "నేను" అనునది ఈ వాక్యములో ఉద్ఘాటించి చెప్పబడుచున్నది, ఈ వక్కాణింపు అది దేవుడనుగ్రహించుచుండిన సహాయమని కోరెషు గ్రహించియుండకపోవుటకు లేక హర్షించుటకు అవకాశములున్నవను భావమును సూచించుచున్నది (2, 3 వచనాలు). దేవుని కటాక్షమునకు లేక దేవుడు కలుగజేయు సామర్థ్యము గూర్చి ఏమియు ఆలోచించకుండానే ఏ పనైనా అంతా మనమే

సాధించామని అనుకొనుట మానవ సహజ స్వభావమైయున్నది.[4]

"నా సేవకుడైన యాకోబు నిమిత్తము నేను ఏర్పరచుకొనిన ఇశ్రాయేలు నిమిత్తము నేను నీకు పేరుపెట్టి పిలిచితిని నీవు నన్ను ఎరుగకుండినప్పటికిని నీకు బిరుదులిచ్చితిని నేను యెహోవాను, మరి ఏ దేవుడును లేడు నేను తప్ప ఏ దేవుడును లేడు. తూర్పుదిక్కునుండి పడమటిదిక్కువరకు నేను తప్ప ఏ దేవుడును లేడని జనులు తెలిసికొనునట్లు నీవు నన్ను ఎరుగకుండినప్పటికిని నిన్ను సిద్ధపరచితిని యెహోవాను నేనే నేను తప్ప మరి ఏ దేవుడును లేడనియు జనులు తెలిసికొనునట్లు" అది సర్వలోకమునకు ఒక సరైన సాక్ష్యమయ్యింది (4–6 వచనాలు).

"వెలుగు" మరియు "అంధకారము" (7 వచనం) అక్షరాలా క్రమము తప్పక ఒకదాని తరువాత మరొకటి కలుగుచున్న పగలు మరియు రాత్రిని సూచించుచుండవచ్చును, లేదా "యోగక్షేమము" మరియు "విపత్తు" వంటి భావమునే తెలుపుచుండును. ఈ విశాల విశ్వమంతటిని దేవుడే అంతిమ అధికారి అని యెషయా నిశ్చితంగా ఘోషించుచుండెను.

## ఇశ్రాయేలుకు, దానిని ఏర్పరచినవాని నుండి ఒక సందేశము (45:8–19)

### దేవుడే సృష్టికర్తయై యున్నాడు! (45:8)

ఆకాశమండలము నీతిని కురిపించునట్లు
అంతరిక్షమా, మహావర్షము వర్షించుము
భూమి నెరలువిడిచి రక్షణ ఫలించునట్లు భూమి
    నీతిని మొలిపించును గాక
యెహోవానగు నేను దాని కలుగజేసియున్నాను.

దేవుని కృపామహదైశ్వర్య కార్యములను వర్ణించుటకు వ్యవసాయిక రూపకాలంకారములు ఉపయోగింపబడినవి. వర్షము భూమిని మళ్లీ పూరించుచున్నట్లు, నీతి మానవాళి ఆత్మను మళ్లీ నింపుతుంది. భూమి ఫలించుచున్నట్లు, "రక్షణ ఫలించును." ఇది మానవుని యోగ్యత లేక శ్రేష్ఠత లేక పనులనుబట్టి కలుగదు, కానీ దేవుడు "దానిని సృష్టించాడు" అను వాస్తవమునుబట్టియే కలుగును.

### సృష్టికర్తయైన ఆయనను ఎవరైనా ప్రశ్నించగలరా? (45:9–13)

మంటికుండ పెంకులలో ఒక పెంకై యుండి తన్ను
    సృజించినవానితో వాదించువానికి శ్రమ.
జిగటమన్ను దాని రూపించువానితో నీవేమి చేయుచున్నావని అనదగునా?
వీనికి చేతులు లేవని నీవు చేసినది నీతో చెప్పదగునా?
నీవు ఏమి కనుచున్నావని తన తండ్రితో చెప్పువానికి శ్రమ
నీవు గర్భము ధరించినదేమి అని స్త్రీతో చెప్పువానికి శ్రమ.

దేవుని కార్యములకు విరోధముగా వ్యక్తముచేయబడు ఎట్టి అసంతృప్తియైనను అది మూఢత్వమే ఔతుంది గాని మరేమీ కాదను వాస్తవమును ఈ వచనములు ప్రాముఖ్యంగా ప్రకటించుచున్నవి.[5] యెషయా మాత్రమే కాదు, కానీ యిర్మీయా (18:6) మరియు పౌలు (రోమీయులకు 9:21) కూడ, దేవుని కార్యములను వర్ణించుటకు "కుమ్మరి" (9 వచనం) వాని

అలంకారిక దృష్టాంతమును ఉపయోగించారు. దేవుని కార్యములు మనము ప్రశ్నించుటకు ఉద్దేశింపబడినవి కావు (10 వచనం).

ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడగు సృష్టికర్తయైన
యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు
-రాగలవాటినిగూర్చి నన్నడుగుదురా?
నా కుమారులను గూర్చియూ నా హస్తకార్యములను
గూర్చియు నాకే ఆజ్ఞాపింతురా?
భూమిని కలుగజేసినవాడను నేనే దానిమీదనున్న
నరులను నేనే సృజించితిని
నా చేతులు ఆకాశములను విశాలపరచెను
వాటి సర్వసమూహమునకు నేను ఆజ్ఞ ఇచ్చితిని.
నీతినిబట్టి కోరెషును రేపితిని
అతని మార్గములన్నియు సరాళముచేసెదను
అతడు నా పట్టణమును కట్టించును
క్రయధనము తీసికొనకయు లంచము పుచ్చుకొనకయు
నేను వెలివేసినవారిని అతడు విడిపించును.

"దేవుడైన యెహోవా," "ఇశ్రాయేలు పరిశుద్ధుడు," "[ఇశ్రాయేలు] సృష్టికర్త" అను బిరుదులు దేవుని సార్వభౌమ అధికారమును ప్రతిబింబించుచున్నవి. దేవుని ప్రజలు, వారి ప్రతి అవసరమును తీర్చుటకు అవసరపడు శ్రద్ధనంతటిని వహించుటకు శక్తి కలిగియున్న ఆయనలో మాత్రమే నమ్మకముంచవలెనని 11వ వచనములో గల పలుకులు వారికి పిలుపునిచ్చుచున్నవి. పౌలు వ్యక్తము చేసిన నమ్మకము కూడా ఇదే: "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను" (ఫిలిప్పీయులకు 4:13).

12వ వచనము దేవుని సృజనాత్మక క్రియలను గుర్తుచేయుచున్నది (యెషయా 43:1 చూడుము). దేవుని సృష్టి కార్యములను (ఆదికాండము 1; 2) యెషయా ఇశ్రాయేలుకు జ్ఞాపకంచేసాడు. అత్యధిక శక్తిసంపూర్ణుడైనవాడును తన పోలిక చొప్పున మానవుని సృజించినవాడును (ఆదికాండము 1:26, 27) ఇశ్రాయేలు యెడల ఆయన కలిగియున్న ప్రణాళికను మరి నిశ్చయముగా నెరవేర్చును.

దేవుడు కోరెషును సూచిస్తూ, "నీతినిబట్టి కోరెషును రేపితిని" అని చెప్పుచున్నాడు (13 వచనం). ఇక్కడ రూఢిపర్చబడుచున్నది కోరెషు నీతి కాదు, అది దేవుని నీతి, దేశబహిష్కృతులై చెరగానున్న తరువాత వారిని పునరుద్ధరించునని దేవుడు యూదాకు వాగ్దానమిచ్చినట్లు అట్టి విడుదల కార్యమును చేయుటకు కోరెషు దేవుని హస్తములో ఒక సాధనమై యున్నాడు. కోరెషు "క్రయధనము తీసికొనకయు లంచము పుచ్చుకొనకయు" పని పూర్తిచేసాడు. నిజముగా, యూదుల పునర్ధురణ పథకముల నిమిత్తము అతడు తన సొంత ధనాగారములో నుండి నిధులను సమకూర్చాడు (ఎజ్రా 1:1-4).

**ఆయనే దేవుడని జనాంగములు మరియు ఇశ్రాయేలు గుర్తించును (45:14-17)**

యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు
-ఐగుప్తీయుల కష్టార్జితమును కూషు వర్తక లాభమును నీకు దొరుకును

దీర్ఘదేహులైన సెబాయీయులును నీ యొద్దకు వచ్చి నీవారగుదురు
వారు నీవెంట వచ్చెదరు సంకెళ్లు కట్టుకొని వచ్చి నీ యెదుట సాగిలపడుదురు
–నిశ్చయముగా నీ మధ్య దేవుడున్నాడు మరి ఏ దేవుడును లేడు
ఆయన తప్ప ఏ దేవుడును లేడు అని చెప్పుచు నీకు విన్నపము చేసెదరు.
ఇశ్రాయేలు దేవా, రక్షకా, నిశ్చయముగా నీవు నిన్ను మరుగుపరచుకొను
    దేవుడవైయున్నావు.
విగ్రహములు చేయువారు సిగ్గుపడినవారైరి
వారందరు విస్మయము పొందియున్నారు.
ఒకడును మిగులకుండ అందరు కలవరపడుదురు.
యెహోవావలన ఇశ్రాయేలు నిత్యమైన రక్షణ పొందియున్నది
మీరు ఎన్న టెన్నటికి సిగ్గుపడకయు విస్మయమొందకయు నుందురు.

జనాంగములు దేవుని విమోచన కార్యమును గుర్తించి దానిని అంగీకరించునని దేవుడు సెలవిచ్చుచుండెను. 14వ వచనంలోని సర్వనామములన్నియును (“నీకు”/“నీ”) విమోచింపబడిన ఇశ్రాయేలును సూచిస్తూ, సంఘమునకు ముందు ఛాయగా ఉంటూ, నొక్కి వక్కాణింపబడుచున్నవి.[6] దేశబహిష్కృతులైనవారు తిరిగి వచ్చుటతో విమోచన ప్రకియ ప్రారంభమై మెస్సీయ రాకడతో చరమావస్థకు చేరుకొన్నది. 15వ వచనం దేవుని సార్వభౌమత్వము గూర్చి అన్యజనుల ఒప్పుకొన్నదానికి పొడిగింపైయున్నది. అది శుద్ధ అవమానమునకు దారితీయు మూడత్వమై యున్నందునుబట్టి – విగ్రహారాధన ఏమైయున్నదో గుర్తింపబడను (16 వచనం).

ఈ వచనములలో పేర్కొనబడిన జనాంగములు ముందుగా తెలియజెప్పబడిన సంగతులను అక్షరాలా నెరవేర్చలేదు. కానీ, ఈ వచనములు మున్ముందు మెస్సీయ రానైయున్న ఒక కాలమును సూచించుచున్నవి. అప్పుడు అధ్యాత్మిక ఇశ్రాయేలు – ఆయనయందు నమ్మకముంచు సమస్త దేశములు, జాతులు, మరియు ప్రజలు మేళనమైయున్న గుంపు – “నిత్యమైన రక్షణ” పొందుకొందురు (17 వచనం).

## సృష్టియందు గల ఆయన సంకల్పము స్థిరపర్చబడినది (45:18, 19)

ఆకాశములకు సృష్టికర్తయగు యెహోవాయే దేవుడు;
    ఆయన భూమిని కలుగజేసి దాని సిద్ధపరచి స్థిరపరచెను
నిరాకారముగానుండునట్లు ఆయన దాని సృజింపలేదు
నివాసస్థలమగునట్లుగా దాని సృజించెను
ఆయన సెలవిచ్చునదేమనగా –
యెహోవాను నేనే మరి ఏ దేవుడును లేడు.
అంధకారదేశములోని మరుగైనచోటున నేను మాటలాడలేదు
–మాయాస్వరూపుడనైనట్టు నన్ను వెదకుడని
    యాకోబు సంతానముతో నేను చెప్పలేదు
నేను న్యాయమైన సంగతులు చెప్పువాడను
యథార్థమైన సంగతులు తెలియజేయువాడను అగు యెహోవాను నేనే.

సృష్టిలో దేవుని ఉద్దేశమేమైయున్నదో ఇక్కడ చాటిచెప్పబడినది: ఆయన “భూమిని కలుగజేసి దాని సిద్ధపరచెను” (18 వచనం). “మరుగైన చోటన ఆయన మాటలాడలేదు”

అని దేవుడు సెలవిచ్చాడు. దేవుని ప్రత్యక్షతలు బాహాటమైనవై ఆయనను మరియు ఆయన యొక్క సృజనాత్మక శక్తిని అంగీకరించువారందరికీ అందుబాటులో ఉన్నవై యున్నవి. దేవుని చిత్తమును తెలిసికొనుటకు జోస్యం చెప్పువారిని, జ్యోతిష్యులను, లేక చిల్లంగితనము గలవారిని ఆశ్రయించాల్సిన అవసరం లేదు. ఆయన సమస్తమును సామాన్య రీతిలో బయలుపరచియున్నాడు! "యథార్థమైన సంగతులు తెలియజేయువాడను అగు యెహోవాను నేనే" (19 వచనం). "యథార్థమైన" అనగా "సత్యమైన" అని చెప్పుకొనవచ్చును.

### జనాంగములకు ఒక సందేశము (45:20-25)

కూడి రండి జనములలో తప్పించుకొనినవారలారా,
  దగ్గరకు వచ్చి కూడుకొనుడి
తమ కొయ్యవిగ్రహమును మోయుచు రక్షింపలేని
  దేవతకు మొఱ్ఱపెట్టువారికి తెలివిలేదు.
మీ ప్రమాణవాక్యములు నా సన్నిధిని తెలియజేయుడి
జనులు కూడుకొని ఆలోచన చేసికొందురు గాక;
పూర్వకాలము మొదలుకొని ఆ కార్యమును తెలియజేసినవాడెవడు?
చాలాకాలముక్రిందట దాని ప్రకటించినవాడెవడు?
యెహోవానగు నేనే గదా? నేను తప్ప వేరొక దేవుడు లేడు.
నేను నీతిపరుడనగు దేవుడను, రక్షించువాడను నేనే
నేను తప్ప మరి ఏ దేవుడును లేడు.
భూదిగంతముల నివాసులారా, నా వైపు చూచి రక్షణ పొందుడి
దేవుడను నేనే మరి ఏ దేవుడును లేడు.
-నా యెదుట ప్రతి మోకాలు వంగుననియు ప్రతి
  నాలుకయు నాతోడని ప్రమాణము చేయుననియు
నేను నా పేరట ప్రమాణము చేసియున్నాను
నీతిగల నా నోటి మాట బయలుదేరియున్నది అది వ్యర్థము కానేరదు.
యెహోవాయందే నీతి బలములున్నవని జనులు నన్ను గూర్చి చెప్పుదురు
ఆయనయొద్దకే మనుష్యులు వచ్చెదరు
ఆయనమీద కోపపడినవారందరు సిగ్గుపడుదురు
యెహోవాయందే ఇశ్రాయేలు సంతతివారందరు
నీతిమంతులుగా ఎంచబడినవారై యతిశయపడుదురు.

"జనములలో తప్పించుకొనినవారు" (20 వచనం) విగ్రహారాధనతో సంబంధాలు తెంచుకొని దేవుని కనుగొనుటకు ఇశ్రాయేలును ఆశ్రయించి అన్యుల దేశములలో ఉన్నవారై యున్నారు. గనుక వారు ఈ విధంగా విగ్రహారాధికులు ఎదుర్కొను గ్రహపాటు నుండి తప్పించుకొని విశ్వవ్యాప్తముగానున్న దేవుని ప్రజలలో భాగమగుదురు.[7]

21 మొదలుకొని 25 వరకు గల వచనముల సారాంశము Clyde M. Woods ద్వారా చక్కగా వివరింపబడినది:

> యెషయా చాటింపు వారు సంతానము ద్వారా ఆయన సమస్త జనులను ఆశీర్వదించునని దేవుడు మన పితరులతో చేసిన వాగ్దానమునకును (ఆదికాండము 12:3; 22:18) క్రీస్తు రాకడలో (గలతీయులకు 3:7-8, 14, 16, 27-29) అట్టి అనాది వాగ్దాన నెరవేర్పునకును

మధ్య నిలిచిపోయినది. విధేయురాలైన ఇశ్రాయేలు సార్వభౌముడైన దేవుని చిత్తము గూర్చిన ఈ నిదర్శన గౌరవములో పరిపూర్ణంగా పాల్గొనును.[8]

ఇక్కడ సూచింపబడినది పాత నిబంధన చారిత్రాత్మక ఇశ్రాయేలు కాదు, ఎందుకనగా వారిలో అందరూ పశ్చాత్తాపపడలేదు. ఆయనయందు విశ్వాసముంచి ఆయనకు విధేయులగు వారందరికిని రక్షణను కలుగజేయుటలో యేసు క్రీస్తు ద్వారా సంపూర్ణము గావింపబడిన సత్కార్యము సందర్భములో క్రొత్త నిబంధన వాక్యభాగములు రెండు ఈ వచనములకు స్థానము కల్పించుచున్నవి:

> అయితే నీవు నీ సహోదరునికి తీర్పు తీర్చనేల? నీ సహోదరుని నిరాకరింపనేల? మనమందరము దేవుని న్యాయ పీఠము ఎదుట నిలుతుము. నా తోడు, ప్రతి మోకాలును నా యెదుట వంగును, ప్రతి నాలుకయు దేవుని స్తుతించును అని ప్రభువు చెప్పుచున్నాడు అని వ్రాయబడియున్నది గనుక మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను. కాగా మనమికమీదట ఒకనికొకడు తీర్పు తీర్చకుందము. ఇదియుగాక, సహోదునికి అడ్డమైనను ఆటంకమైనను కలుగజేయకుందుమని మీరు నిశ్చయించుకొనుడి. సహజముగా ఏదియు నిషిద్ధము కాదని నేను ప్రభువైన యేసునందు ఎరిగి రూఢిగా నమ్ముచున్నాను. అయితే ఏదైనను నిషిద్ధమని యెంచుకొనువానికి అది నిషిద్ధమే (రోమీయులకకు 14:10-14).

> అందుచేతను పరలోకమందున్నవారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించును (ఫిలిప్పీయులకు 2:9-11).

సమస్త ప్రజలు దేవుని యెదుట, క్రీస్తునందలి జీవితమునుబట్టి స్వచ్ఛందగా లేదా, తీర్పు దినాన విధేయులై నిలువబడుదురు.[9] ప్రభువైన యేసు క్రీస్తు రాకడ ఇశ్రాయేలుకును సమస్త జనులకును గత్యంతరములేని ఒకే ఒక నిరీక్షణయై యుండినది.

---

సూచనలు

[1]Victor P. Hamilton, in *Theological Wordbook of the Old Testament,* ed. R. Laird Harris, Gleason L. Archer, Jr., and Bruce K. Waltke (Chicago: Moody Press, 1980), 1:530. [2]క్రొత్త నిబంధనలో *Messian* అను పదము అగుపించు మరొక్కటే రిఫరెన్సు యోహాను 4:25ను కూడ చూడుము. [3]1879 సంవత్సరంలో బబులోనులో కనుగొనబడిన కోరెషు స్థూపకము, రాజు యొక్క సాహసకృత్యములను మరియు ఆయన చెరలోనుండిన వారికి చేసిన ఉపకారములను వర్ణించుచున్నది. ఈ కళాకృతి ఈనాడు బ్రిటిషువారి పురావస్తు ప్రదర్శనశాలలో ఉన్నది. (Edwin M. Yamauchi, *Persia and the Bible* [Grand Rapids, Mich.: Baker Book House, 1990], 87-89; James B. Pritchard, ed., *Ancient Near Eastern Texts Relating to the Old Testament*, 3d ed. [Princeton: Princeton University Press, 1969], 315-16.) [4]యెషయా 10:12-14 మరియు దానియేలు 4:30-32 చూడుము. [5]కుమ్మరి మరియు మట్టి గూర్చిన అలంకారము 29:16లో కూడ వాడబడియున్నది. [6]అవి ఎప్పటి వలెనే క్రియ తరువాత ఉంచబటకు బదులుగా, హెబ్రీ భాషలో వాక్యము మొదట్లో ఉంచబడి ఉన్నవి. [7]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 365. [8]Clyde M. Woods, *People's Old Testament Notes: Isaiah* (Henderson, Tenn.: Woods Publications, 2002), 204. [9]Ibid., 205.

### ❖❖❖ దేవుని చేత అభిషేకింపబడినవాడైన కోరెషు ❖❖❖
### (అధ్యాయం 45)

దేవుడు కోరెషును, పారసీక రాజైనవానిని, ఆయన “అభిషేకించిన వానిని” పిలిచాడు. ఈ హోదా ద్వారా దేవుడు కోరెషు యొక్క గుణలక్షణాలను సూచించుటలేదు; ఆయన రాజును తన సేవలో వాడుకొనునని ఆయన ప్రకటించుచుండెను. తన గొప్ప కటాక్షముచొప్పున, దేవుడు తన సంకల్పములను నెరవేర్చుకొనుటకు అప్పుడప్పుడు అన్య పరిపాలకులను మరియు పలుకుబడిగలవారిని కూడ నియమించుకొంటాడు.

ఈ ప్రవచనము పాత నిబంధనలోని గొప్ప ప్రవచనములో ఒకటిగా నిలిచిపోతుంది. దీనిని చదివి దీని అంతర్భావములను మననం చేయువారు ఎవరు కూడా తీవ్రంగా కదలింపబడనివారుండరు.

*పరిశుద్ధ బైబిలు ప్రేరేపింపబడిన గ్రంథమని అది సూచించుచున్నది.* చాటింపు చేయబడినప్పటికి, మూందుగానే తెలియజెప్పబడిన సంఘటన సంభవించుటకు యింకా కనీసము వంద సంవత్సరాల సమయముండినది. కోరెషు పేరుపెట్టి పిలువబడినవాడు గనుక ఆయనకు చెప్పబడుచుండిన దానిని అపార్థం చేసికొనుటయను అంశము తలెత్తదు. ఉద్దేశింపబడిన వాని గూర్చి యెషయా ముక్కుసూటిగా తెలియజెప్పాడు (1 వచనం).

*దేవుని ప్రణాళికా నిశ్చయతను అది బయలుపర్చుచున్నది.* దేవుడు తన సంకల్పములను సాధించుటకై అన్యుడైన రాజును సహితం వాడుకొంటాడు. ఆయన తన ఉద్దేశములు సఫలమగునట్లుగా దేవుడు చూస్తాడు. “నేను నీకుముందుగా పోవుచు మెట్టగానున్న స్థలములను సరాళము చేసెదను; … పేరుపెట్టి నిన్ను పిలిచిన ఇశ్రాయేలు దేవుడనైన యెహోవాను నేనే యని నీవు తెలిసికొనునట్లు …” అని ఆయన సెలవిచ్చాడు (2, 3 వచనాలు). ఆయన నియమించిన పనిని ఆయన చిత్తప్రకారమే కోరెషు చేయునట్లు దేవుడు సమస్త ఆటంకములను తొలగిస్తాడు.

*దేవుని కటాక్షములో గల ఉద్దేశమును అది ఉదాహరణంగా తేటపర్చుచున్నది.* దేవుడు చేయునదేదైనను, తన ప్రజల మేలు నిమిత్తమును ఆయన పరిశుద్ధ సంకల్పము నెరవేర్పు నిమిత్తమును చేయును. “నా సేవకుడైన యాకోబు నిమిత్తము, నేను ఏర్పరచుకొనిన ఇశ్రాయేలు నిమిత్తము, నేను నీకు పేరుపెట్టి నిన్ను పిలిచితిని; నీవు నన్ను ఎరుగకుండినప్పటికిని నేను నీకు బిరుదులిచ్చితిని” అని ఆయన సెలవిచ్చాడు (4 వచనం).

దేవుడు తన ప్రజలను దృష్టిలో ఉంచుకొని మాత్రమే పనులు చేయడు, కానీ ఆయన మాత్రమే దేవుడని సమస్త జనులు తెలిసికొనునట్లు ఆయన తన కార్యములను చేయును. “నేను యెహోవాను, మరి ఏ దేవుడును లేడు; నేను తప్ప ఏ దేవుడును లేడు” అని ఆయన ప్రకటించాడు. ఇంకా, “తూర్పుదిక్కునుండి పడమటిదిక్కు వరకు నేను తప్ప ఏ దేవుడును లేడని జనులు తెలిసికొనునట్లు, నీవు నన్ను ఎరుగకుండినప్పటికిని, నిన్ను సిద్ధపరచితిని; యెహోవాను నేనే, నేను తప్ప మరి ఏ దేవుడును లేడు” అని కూడా సెలవిచ్చాడు

(5, 6 వచనాలు).

*దేవుని సజ్జనత్వమును వెల్లడించుచున్నది.* ఆయన ఎన్నడును అబద్ధమాడడు; మాట ంటే, మాటే. ఏదైన ఒక విషయము జరుగునని ఆయన చెప్పినట్లయితే, అది తప్పక ఆయన చెప్పినట్లే జరుగును. "పూర్వకాలము మొదలుకొని ఆ కార్యమును తెలియజేసినవాడెవడు? చాలకాలము క్రిందట దాని ప్రకటించినవాడెవడు? యెహోవానగు నేనే గదా?" అని ఆయన చెప్పుచున్నాడు (21బి వచనం). ఆయన ప్రకటించిన ప్రకారము జరుగునని దేవుడు చెప్పాడు. ఆయన చెప్పిన ప్రకారం జరిగినది. రెండు పాత నిబంధన గ్రంథములు, ఎజ్రా మరియు నెహెమ్యా. యెరూషలేము పట్టణమును పునఃనిర్మించుటకై కోరెషు చేపట్టిన చర్యలు పూసగుచ్చినట్లు వివరించుచున్నవి. ఈ ప్రవచనములోని ప్రతి వివరము సవివరంగా సంభవించినది.

*ఎలాగైనా సరే మానవున్ని రక్షించవలసినదే యని దేవుడు కలిగియున్న కోరికను అది మనకు గుర్తుచేయుచున్నది.* దేవుడు ఎందుకింత గొప్ప ప్రణాళిక వేసాడు? ఇంతకూ, ఆయన అంతిమ లక్ష్యమేమైయుండినది? ఆయన సమస్త మానవుల ఆత్మల పట్ల గల తన ప్రేమను బయలుపర్చవలెనని ఆశించుచున్నాడు. "భూదిగంతముల నివాసులారా, నావైపు చూచి రక్షణ పొందుడి; దేవుడను నేనే, మరి ఏ దేవుడును లేడు. నా యెదుట ప్రతి మోకాలు వంగుననియు ప్రతి నాలుకయు నాతోడని ప్రమాణము చేయుననియు, నేను నా పేరట ప్రమాణము చేసియున్నాను" అని ఆయన సెలవిచ్చుచున్నాడు (22-24 వచనాలు).

*సకల జనులు ఆయనను స్తుతించునట్లు దేవుడు ఎవరై యున్నాడో అది నివేదించుచున్నది.* "యెహోవాయందే ఇశ్రాయేలు సంతతివారందరు నీతిమంతులుగా ఎంచబడినవారై యతిశయపడదురు" (25 వచనం). దేవుని ఖచ్చితత్వమును, విశ్వసనీయతను, సర్వశక్తిమంతమును, మరియు విశ్వవ్యాప్త ప్రణాళికను ప్రతి ఒక్కరు చూస్తారు. ఈ దేవుని కీర్తించుటకును ఆయనక కృతజ్ఞతాస్తుతులు సమర్పించుకొనుటకును సకల మానవులు వారి స్వరములనెత్తుదురు.

ఈ ప్రవచము గూర్చి మనము ఆశ్చర్యపడుచున్నాము; కానీ ఈ ఆశ్చర్యమును అధిగమించి యున్న వాస్తవమేమనగా, మనము దానునుండి నేర్చుకొనుచున్నాము. పరిశుద్ధ లేఖనముల వెనుక నున్న ప్రేరేపణను, దేవుని ప్రణాళికల నిశ్చయతను, దేవుని కటాక్షములో గల సదుద్దేశమును, మానవుని రక్షణ విషయమై దేవునికి గల అంతిమ వాంఛను, మరియు దేవుని నిజ స్వభావమును మనము చూచుచున్నాము. నీవు దేవున్ని స్తుతించునట్లు ఈ ప్రవచనము నిన్ను ప్రేరేపించినట్లయితే, ప్రియ చదువరీ, యిక నిన్నేది ప్రేరేపేస్తుంది?

---

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

---

### ❖❖❖ ప్రవచనములోగల అద్భుతము ❖❖❖

### (44:28; 45:1)

ఈ ప్రవచనములో కోరెషు పేరు పేర్కొనబడుట ఉదారతావాదులైన పండితుల మనస్సులను వికలము చేయుచున్నది. క్రీ.పూ. 700 సంవత్సరముల కాలములో

జీవించినవాడు, 100 సంవత్సరముల తరువాత పుట్టినవానిని పేరుపెట్టి పిలుచుచు, అతడు 160 సంవత్సముల తరువాత, క్రీ.పూ. 539లో ఫలానా కార్యము చేస్తాడని ముందుగానే తెలియజెప్పుటకు ఎటువంటి అవకాశము లేదని వారనుచున్నారు. యెషయా గ్రంథంలోని ఈ విభాగము కోరెషు కాలములో లేదా అతని తరువాతి కాలములో వ్రాయబడి యుండునని కొందరు చెప్పుచున్నారు.

ఏదిఏమైనా, యెషయా దీనిని ముందుగానే తెలియజెప్పాడను అభిప్రాయంతో నాకెటువంటి ఇబ్బంది లేదు. యూదీయ చరిత్రకారుడైన జోసీఫస్ జరిగిన దాని గూర్చి తన దృక్పథమును ఈ విధంగా వ్యక్తముచేయుచున్నాడు: “యెషయా వదిలిపెట్టి వెళ్లిన ప్రవచనముల గ్రంథమును కోరెషు చదువుటవలన ఇది (యెరూషలేము దేవాలయు పునఃనిర్మాణము) అతనికి తెలిసియుండినది.”[1] అనగా జోసీఫస్ చెప్పుచున్న దాని ప్రకారము, ఒకనాడు కోరెషు యెషయా గ్రంథాన్ని చదువుచు, ఇశ్రాయేలు ప్రజలు వారి స్వస్థలమునకు తిరిగి వెళ్లునట్లు వారికి సాయము చేయవలసినది అతడే అని గమనించుట మరియు గ్రహించుట తటస్థించినది, గనుక అతడు వారికి స్వాతంత్ర్యమును ప్రకటించుటకు తీర్మానించుకొన్నాడని మరో మాటలో చెప్పుకొనవచ్చును:

> అదే ప్రకారంగా, కోరెషు దీనిని చదివి దైవీకమైన శక్తిని శ్లాఘించినప్పుడు, వ్రాయబడిన దానిని నెరవేర్చవలెనని ఆయనలో చెలరేగిన మనఃపూర్వకమైన ఆకాంక్ష మరియు అభ్యుదయేచ్ఛ ఆయనను కైవశముచేసికొన్నవి; గనుక ఆయన బబులోనులోనుండిన అత్యంత ప్రముఖ యూదులను పిలిపించి, వారు తన స్వదేశమునకు వెళ్లి, వారి పట్టణమైన యెరూషలేమును మరియు దేవుని ఆలయమును పునఃనిర్మించుకొనుటకు అనుమతించబడుచున్నారని వారితో చెప్పుచూ తన మనోవాంఛను పంచుకొన్నాడు. ...[2]

అయితే సరిగ్గా ఇలాగే జరిగినదని నేననుకొనను. ఈ సంఘటనలు యెషయా చేత క్రీ.పూ. 725లో, క్రీ.పూ. 586లో దేవాలయము విధ్వంసము చేయబడుటకు దాదాపు 140 సంవత్సరములకు పూర్వమే ముందుగా తెలియజెప్పబడినవని నేను నమ్ముచున్నాను. ప్రవచనములు పలుకుటకు యెషయా కలిగియండిన సామర్థ్యములను యూదులు అంతకుమునుపెప్పుడో చాలా కాలం క్రితమే గుర్తించారు. క్రైస్తవులమైన మనుము కూడా, దేవుడు తానేర్పరచుకొన్న ప్రవక్త భవిష్యత్తు గూర్చి ప్రవచింపవలెనని ఆయన అతనికి సమర్థతనిచ్చి సాధ్యం చేసాడను అంగీకరింపవలెను.

---

సూచనలు

[1]Josephus *Antiquities* 11.1, 2. [2]Ibid.